

రాజస్థాన్ నుంచి జిల్లాకు

- ఇనుప పనిముట్ల తయారీతో ఉపాధి
- చెమటోడుస్తున్న మహిళలు, పిల్లలు కూడా
- గ్రామాల్లోని బస్టాండ్లలోనే నివాసం 8

ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

- భూముల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం
- దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్

ఇంటర్వ్యూ



జగదేవ్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆలయ భూముల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఉమ్మడి జిల్లా దేవాలయాల అభివృద్ధితో పాటు పలు కార్యక్రమాల వివరాలు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

ఆలయాల భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆలయాల భూముల రక్షణకు దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. భూములకు సంబంధించి ధరణిలో నమోదు చేయడంతో పాటు, హద్దులను నిర్ధారించాం. ఆలయాల భూములుగా బోర్డులను ఏర్పాటు చేశాం.

పలు గ్రామాల్లో ఆలయాల భూముల విషయంలో వివాదం నెలకొంటున్నది. ఏమైనా చర్యలు చేపడుతున్నారా?

వివాదం నెలకొంటున్న విషయం వాస్తవమే కానీ, మా వద్ద ఉన్న రికార్డుల ప్రకారం చర్యలు తీసుకుంటాం. పలువురు మాకే రికార్డులు ఉన్నాయని చెబుతున్నారు తప్ప ఎవరు సరైన పత్రాలు సమర్పించడం లేదు. చాలా ఆలయాలకు సంబంధించిన భూముల విషయంలో కోర్టుల్లో కేసింగ్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎండోమెంట్ ట్రిబ్యునల్‌తో పాటు హైకోర్టులోనూ నడుస్తున్నాయి. వాటికి సంబంధించి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మేము కౌంటర్ దాఖలు చేయడంతో పాటు సరైన డాక్యుమెంట్‌లను సమర్పిస్తున్నాం. కోర్టు తీర్పులు వెలువడగానే ఆయా భూములను దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంటాం.

ఉమ్మడి జిల్లాలో ఎన్ని ఆలయాలు ఉన్నాయి?

ఉమ్మడి మెదక్ జిల్లాలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 36 ఆలయాలు ఉన్నాయి. రెండు లక్షలపైన ఆదాయం ఉన్నవి మాత్రమే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉంటాయి. 25 లక్షలపైన ఆదాయం ఉన్న 6ఏ ఆలయాలు 13, 6బీ ఆలయాలు 12, 6సి ఆలయాలు 11 ఉన్నాయి. మిగతావవి మెదక్ జిల్లాలో 7, సిద్దిపేటలో 16, సంగారెడ్డిలో 13 ఆలయాలు ఉన్నాయి

సిబ్బంది కొరత ఉన్నదా, గ్రామాల్లోని దేవాలయాలకు దూపదీప నైవేద్యం అందిస్తున్నారా?

దేవాదాయ శాఖలో సిబ్బంది కొరత చాలా ఉన్నది. ఇటీవల ఉమ్మడి జిల్లాకు గ్రేడు 3 ఈవోలు ఇద్దరు వచ్చారు. మొత్తం గ్రేడ్ 1 ఇద్దరు, గ్రేడ్ 2 ముగ్గురు, గ్రేడ్ 3లో ఇద్దరు ఈవోలు ఉన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 849 దేవాలయాలలో దూపదీప నైవేద్యం పథకం కొనసాగుతున్నది. ఆయా ఆలయాల్లో అర్చకులకు 4వేలు, దూపదీప నైవేద్యం పెట్టడానికి మరో నాలుగు వేల ఖర్చు చొప్పున ఎనిమిది వేల రూపాయలు అర్చకులకు అందజేస్తున్నాం.





హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో భోజనం చేస్తున్న విద్యార్థులు, బాలికల పాఠశాలలో టేబుళ్లు లేని డైనింగ్‌హాల్

ఆరుబయటే భోజనం

పాఠశాలల్లో నిరుపయోగంగా డైనింగ్‌హాళ్లు

నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా వినియోగమేది?

బిల్లులు రాక హెచ్‌ఎంలకు అప్పగించని కాంట్రాక్టర్లు

నిధులు మంజూరైనా.. మరికొన్ని ఇంకా పూర్తికాని వైనం

హుస్నాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆరుబయట, చెట్ల కింద దుమ్ముధూళిలోనే భోజనం చేస్తున్నారు. మన ఊరు - మన బడి పథకం కింద డైనింగ్‌హాళ్లను నిర్మించగా ఇప్పటికే కొన్ని పూర్తవగా, నెలలు గడుస్తున్నా వాటిని వినియోగంలో తీసుకురావడం లేదు. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పోవడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు వీటిని అప్పగించడం లేదు. దీంతో కోట్ల రూపాయలతో నిర్మించిన డైనింగ్ హాళ్లు అలంకారప్రాయంగా మారాయి. వాటిల్లో డైనింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. పూర్తయిన వాటి పరిస్థితి ఇలా ఉండగా.. ఇంకా కొన్ని పునాది దశలో, ఇంకొన్ని పిల్లర్ల దశలో, మరికొన్ని రంగులు వేయని స్థితిలో ఉన్నాయి. హుస్నాబాద్ డివిజన్‌లోని కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట, మద్దూరు, బెజ్జంకి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న దుస్థితి. పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లులు నిర్మించి నెలలు గడుస్తున్నా వినియోగించడం లేదు. వీటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పగించడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



మద్దూరులో రంగులు వేయని డైనింగ్‌హాల్





హుస్నాబాద్ పాఠశాలలో బయటే వండి, వడ్డిస్తున్న భోజనం, అక్కన్నపేటలో తాళం వేసిఉన్న డైనింగ్‌హాల్, కిచెన్ షెడ్డు

డివిజన్‌లో పాఠశాలల్లో నిర్మించిన డైనింగ్‌హాళ్లు

మన ఊరు - మన బడి పథకం కింద ఒక్కో డైనింగ్‌హాళ్ల నిర్మాణానికి రూ.14 లక్షలు మంజూరు చేశారు. హుస్నాబాద్ మండలంలో నాలుగు పాఠశాలలకు, అక్కన్నపేట మండలంలోని ఏడు, మద్దూరు మండలంలోని మూడు, కోహెడ మండలంలోని ఆరు, బెజ్జంకి మండలంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు నిధులు మంజూరయ్యాయి. హుస్నాబాద్ పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు మహ్మదాపూర్‌లో డైనింగ్‌హాళ్లు పూర్తయినప్పటికీ వినియోగించడం లేదు. మీర్జాపూర్‌లో పనులు మధ్యలో నిలిచిపోయాయి. అక్కన్నపేట

మిగతా 8వ పేజీలో

మల్లన్న ప్రసాదంలో పురుగు కలకలం!

- పులిహోరలో కనిపించిన అవశేషాలు
- ఇది పూర్తిగా అవాస్తవం : ఈవో బాలాజీశర్మ

చేర్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా చేర్యాలలోని కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ప్రసాదంలో పురుగు కనిపించడం కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు ఆదివారం మల్లన్న ఆలయానికి వచ్చాడు. స్వామి వారి దర్శనం అనంతరం పులిహోర ప్రసాదం కొనుగోలు చేసి ఆరగించబోతుండగా అప్పులోనిగుర్రం పురుగు అవశేషాలు కనిపించడంతో కంగుతిన్నాడు. ఇటీవల లడ్డూ ప్రసాదంలో తలవెంట్రుకలు వచ్చాయన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆలయ ఈవో బాలాజీశర్మను సంప్రదించగా పులిహోర ప్రసాదంలో పురుగులు వచ్చాయన్నది పూర్తి అవాస్తవమని, ఈ విషయమై భక్తులెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ, భక్తుల మనోభావాలు దెబ్బతిసేందుకు కొందరు ప్రయత్నించడం విచారకరం అని చెప్పారు.



పులిహోర ప్రసాదంలో లభ్యమైన పురుగు అవశేషాలు

మన వంటగది.. మన బాధ్యత

- సందడిగా సాగిన ఐవోసీఎల్ కుకింగ్ కాంపిటీషన్ 7



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

విధ్వంసం, కూల్చివేతల దిశగా రేవంత్ పాలన

- రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరాటం తప్పదు
- అదానీ వ్యవహారంపై ప్రధాని మోదీది దాటవేత వైఖరి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

గజ్వేల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విధ్వంసం, కూల్చివేతల దిశగా పాలన సాగిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన సిద్దిపేట జిల్లా మూడవ మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. మల్లన్నసాగర్‌లో బీఆర్‌ఎస్ పాలన కొనసాగిన విధంగానే లగిచర్లలో కాంగ్రెస్ పాలన ఉందన్నారు. గిరిజనులపై పోలీసులు పాశవికంగా దాడికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఏడాది పాలన ముగిసినందున హామీలను నెరవేర్చని పక్షంలో సీపీఎం, వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటాలను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. అదానీ వ్యవహారంపై మోదీ దాటవేత వైఖరిని అవలంభిస్తున్నారని, ప్రధాని వెంటనే స్పందించాలని తమ్మినేని డిమాండ్ చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ఇండియా కూటమి నాయకుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాధనాన్ని అంబానీ, అదానీలకు మోదీ కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి కుదుర్చుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మోదీ పాలన ప్రస్తుత తరహాలోనే కొనసాగితే దేశం విచ్ఛిన్నం అవడం ఖాయమన్నారు. మతాలు, కులాలు, వర్గాలుగా విడిపోయి దేశం ప్రపంచపటం నుంచి మాయమవుతుందన్నారు. ఎన్నికల్లో నిలబడితే ఎర్రజెండా పార్టీలు గెలవడంలో విఫమవుతున్నాయని, కానీ పోరాటాలు చేయాల్సి వస్తే ఎర్రజెండానే ప్రజలు నమ్ముకుంటారన్నారు. హక్కులు సాధించుకోవాలంటే పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. కమ్యూనిస్టులు లేకుండా దేశానికి భవిష్యత్తు లేదన్నారు. మతోన్మాదం, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ, జనగామ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏ.మల్లేశం, నాయకులు గోపాలస్వామి, సందబోయిన ఎల్లయ్య, భాస్కర్, శశిధర్, శారద, నవీన, బండ్ల స్వామి తదితరులున్నారు.

ముఖ్యమంత్రిపైనే ఆశలు

- గజ్వేల్ నియోజకవర్గంలో నేడు సీఎం పర్యటన
- ఏడాదిగా పెండింగ్‌లో అభివృద్ధి పనులు
- పరిష్కారం కానీ పలు సమస్యలు
- భూనిర్వాసితులకు ఉపాధి దిశగా పారిశ్రామిక కారిడార్ మంజూరయ్యేనా?

గజ్వేల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్‌లో పర్యటించనున్నారు. నియోజకవర్గంలోని ములుగు మండలం బండతిమ్మాపూర్ గ్రామంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిశ్రమ ప్రారంభోత్సవానికి రానున్నారు. దీంతో ఏడాదిగా పెండింగ్‌లో పడిన పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రాక సందర్భంగా మోక్షం లభిస్తుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత పదేళ్లగా అనేక అభివృద్ధి పనులతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా దూసుకెళ్లగా, ఏడాదిగా అనేక పనులు పెండింగ్‌లో పడ్డాయి. ముఖ్యంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు, గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌ల నిర్మాణం, వర్గల్, ములుగు పారిశ్రామిక కారిడార్, గజ్వేల్ మాతాశిశు ఆసుపత్రి ప్రారంభోత్సవం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, తూప్రాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెండింగ్‌లో పడిన అభివృద్ధి పనులు, హాస్టళ్లకు శాశ్వత భవనాలు, ఐవోసీ భవనాలు, పీహెచ్‌సీల పూర్తి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితుల ప్యాకేజీలు, పరిహారాలు, ఇళ్లు, ఇతరత్రా పెండింగ్ పనులకు మోక్షం లభిస్తుందేమోనని నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు. ఏడాదిగా పనులు చేపట్టకపోవడంతో నిర్వాసితులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భూనిర్వాసితుల కోసం ప్రత్యేక పారిశ్రామిక కారిడార్, ఇతరత్రా ఉపాధి అవకాశాల కల్పనకు సీఎం దారి చూపుతారని ఆశగా ఎదురు చూస్తున్నారు. అంతేకాకుండా గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గ్రూపుల గోల తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి సరిదిద్ది వారి సమస్యలను పరిష్కరించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని కార్యకర్తలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



గజ్వేల్ పట్టణ వ్యూ





హాఫ్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎవరెస్ట్ అధిరోహకురాలు మాలావత్ పూర్ణ, ఎస్పీ రూపేష్

ఐఐటీ హైదరాబాద్‌లో హాఫ్ మారథాన్

- ప్రారంభించిన ఎస్పీ రూపేష్, మాలావత్ పూర్ణ 7
- పాల్గొన్న 1500 మంది ఔత్సాహికులు
- సందడిగా మారిన ఐఐటీహెచ్ ప్రాంగణం

లాజిస్టిక్ హబ్‌గా మనోహరాబాద్

- పర్కిబండలో 315 ఎకరాల్లో లాజిస్టిక్‌హబ్ 7
- మండలంలో ఇప్పటికే 200 పరిశ్రమలు
- భవిష్యత్‌లో మరింత విస్తరించే అవకాశం

మరో విడత.. రైతులకు ఊరట

జిల్లాలో 9,063 మంది రైతులకు రూ.95.25 కోట్ల రుణమాఫీ

- త్వరలోనే రైతు ఖాతాలో జమ

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హతలు కలిగి రుణమాఫీ వర్తించని రైతులకు ప్రభుత్వం ఊరట కలిగించే శుభవార్తను తెలిపింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు వేదికగా నిర్వహించిన రైతు పండుగ సభ నుంచి రుణమాఫీ డబ్బును విడుదల చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో 9,063 మంది రైతులకు రూ.95.25 కోట్లు మాఫీ అయ్యాయి. దరఖాస్తు చేసుకుని నెలల తరబడి నిరీక్షిస్తున్న రైతుల ఖాతాల్లో రెండు, మూడు రోజుల్లో మాఫీ డబ్బు జమకానుండడంతో రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

నాలుగు విడతల్లో రుణమాఫీ ఇలా..

ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ చేసింది. జిల్లాలో మొత్తం 1,11,386 మంది రైతులకు రూ.938.305 కోట్లను మాఫీ చేసింది. తొలి విడతలో రూ.లక్షలోపు రుణాలు 53,129 మంది రైతులకు రూ. 290.21 కోట్లు మాఫీ అయ్యాయి. మలి విడతలో రూ.లక్షన్నరలోపు 27,955 మంది రైతులకు రూ.279.33 కోట్లు మాఫీ జరిగింది. మూడో విడతలో రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు 21,239 రైతులకుగాను రూ. 273.51 కోట్లు మాఫీ అయింది.

మాఫీ వర్తించకపోవడానికి కారణాలు

జిల్లాలో వివిధ కారణాలతో వేలాది మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. వారంతా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. రేషన్‌కార్డు లేకపోవడం, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కాకపోవడం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో రైతుల వివరాల తప్పుగా ఉండడం తదితర కారణాలతో రుణమాఫీ నిలిచిపోయిందని అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో 15 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేపట్టి మరోసారి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నివేదిక ప్రకారం ప్రభుత్వం రైతుపండుగ సందర్భంగా 9,063 మందికి రుణమాఫీ చేసింది.

రెండు లక్షలపైన ఉన్న వారికి జరిగేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో భాగంగానే రాగానే రూ.రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ దిశగానే రెండు లక్షలలోపు ఉన్నవారికి నాలుగు విడుతల్లో రుణమాఫీ చేసింది. కానీ రెండు లక్షలపైనున్న వారికి రుణమాఫీ జరుగుతుందా లేదా అని ఆందోళన నెలకొన్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాకపోవడంతో రైతులు వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదు. రూ.రెండు లక్షలపైనున్న పంట రుణమాఫీని చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





కొంగలు కనువిందు

కోతలు పూర్తయి వడ్లు అమ్ముకున్న రైతులు ప్రస్తుతం యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. అక్కన్నపేట మండలం అంతకపేటలో పొలాన్ని దున్నుతుండగా పురుగుల కోసం కొంగలు గుంపులుగుంపులుగా అక్కడికి చేరుకుని కనువిందు చేశాయి.

అక్కన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

గురుకుల విద్యార్థి అదృశ్యం


సాయిప్రకాష్(ఫైల్)

నారాయణఖేడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఖేడ్ పట్టణ శివార్లలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ మండలం చందాపూర్‌కు చెందిన సాయిప్రకాష్(13) గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం బిస్కెట్లు తీసుకువస్తానని తోటి విద్యార్థులకు చెప్పి పాఠశాల నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో గురుకుల ప్రత్యేక అధికారిణి బాలమణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పటాన్‌చెరులో ఫార్మాసిటీ బాధితులు

- నాలుగు గ్రామాల నుంచి 120 మంది రాక
- పారిశ్రామిక వాడల్లో పర్యటన
- పరిశ్రమలతో కలుగుతున్న దుష్పరిణామాలపై ఆరా
- ఫార్మాసిటీ రద్దు చేసేదాకా పోరాడుతామని స్పష్టం


కాజుపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు

యాచారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో ఏర్పాటు చేయనున్న విషపూరితమైన ఫార్మాసిటీని రద్దు చేసేదాక తాము శాంతియుతంగా పోరాడుతామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు ప్రకటించారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం పేదల భూములు తీసుకున్నదన్నారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నయవంచన చేసిందని మండిపడ్డారు. ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన 120 మందితో కూడిన బృందం రెండు బస్సులలో పటాన్‌చెరువు పారిశ్రామిక ప్రాంతాలు, సంగారెడ్డి జిల్లా కిష్టయపల్లి, కాజుపల్లి, గడ్డపోతారం, పాషామైలారం తదితర గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామాల రైతులను కలిసి పరిశ్రమల కలుగుతున్న దుష్పరిణామాలపై ఆరా తీశారు. ఈనే దశలో ఉన్న పాడి గేదెలు, ఆవులు మృత్యువాత పడుతున్నాయని అక్కడి రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఇక్కడ 55 ఏళ్లకు మించి మనుషులు బతకడం గగనమేనని, గర్భిణులకు తరచూ గర్భస్రావమవుతుందని నని చెప్పి కన్నీటి పర్యంతమైనట్లు వారు పేర్కొన్నారు. వ్యర్థ రసాయనాలతో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని కాజుపల్లి, గడ్డపోతారం పాషామైలారం గ్రామాల రైతులు తెలిపినట్లు చెప్పారు. పాడిపశువులకు ఆర్‌వో వాటర్ ఇస్తున్నట్లు చెప్పారన్నారు. తమ ప్రాణం పోయినా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో విషపూరితమైన ఫార్మాకంపెనీలు ఏర్పాటు చేయనివ్వబోమని ఫార్మాసిటి వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, సభ్యులు మహిపాల్‌రెడ్డి, బర్ల మల్లేష్ తదితరులు తెలిపారు. ఫార్మాసిటీ రద్దుకు విపక్షాలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలో ఉద్యమం లేవదీస్తామని చెప్పారు.


అప్పులు తీర్చలేక గిరిజన రైతు ఆత్మహత్య


మోతిలాల్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చలేక గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాళ్లపల్లితండాకు చెందిన రైతు ధనావత్ మోతిలాల్ (35) మద్యానికి బానిసై పెద్ద ఎత్తున అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఆదివారం ఉదయం 6 గంటలకు పొలం దగ్గరకు వెళ్లి గడ్డి మందు తాగడంతో కిందపడి విలవిలలాడుతున్నాడు. అంతలోనే అక్కడికి వెళ్లిన భార్య అనిత ఏమైందని మోతిలాల్‌ను అడగ్గా గడ్డి మందు తాగానని తెలిపాడు. వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

సీబీఐ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా..

- నర్సాపూర్‌లో పలువురికి సైబర్ నేరగాళ్ల కాల్స్



సీబీఐ అధికారినంటూ ఓ వ్యక్తికి వచ్చిన వాట్సాప్ కాల్

నర్సాపూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నేను సీబీఐ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా.. అంటూ మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో పలువురికి వారం రోజులుగా వాట్సాప్ కాల్స్ వస్తున్నాయి. కాల్ చేసి తాము సీబీఐ అధికారులమంటూ బెదిరింపులకు దిగుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజులలో నలుగురికి పైగా కాల్స్ వచ్చాయి. అవతలివాళ్లు హిందీలో మాట్లాడుతూ తాము సీబీఐ అధికారులమని, మీ కొడుకుపై కేసు నమోదైందని, అరెస్టు చేస్తామంటూ బెదిరించినట్లు బాధితులు వాపోయారు. సదరు నంబర్ వాట్సాప్ డీపీని పరిశీలిస్తే పోలీసు డ్రెస్సులో ఉన్న వ్యక్తి ఫొటో కనిపించడంతో నిజమేనని అనుకుని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం కూడా ఓ మహిళకు ఫోన్ చేసి నీ కొడుకును అరెస్టు చేస్తామంటూ చెప్పడంతో ఆమె భయపడి ఇరుగు పొరుగువారికి చెప్పింది. ఇదంతా డబ్బులు కొట్టేసేందుకు సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ అని, ఆందోళన చెందవద్దని తెలిపారు. మరోసారి ఇలాంటి కాల్ వస్తే ఎత్తకూడదని ధైర్యం చెప్పారు. ఎవరైనా కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడితే ఏ మాత్రం భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని స్థానిక సీఐ జాన్‌రెడ్డి సూచించారు. నకిలీ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి ప్రతిభ

- రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు


ప్రాజెక్టుతో విద్యార్థి రేవంత్

మెదక్ అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో శివ్వాయిపల్లి ఎంపీయూపీఎస్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి రేవంత్ ప్రతిభ కనబరిచాడు. అతడు రూపొందించిన నాచురల్ ఫామింగ్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సహజ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు, ఆహార రుచిని మెరుగుపర్చడంతోపాటు నేలను మృదువుగా చేస్తోందని, సాగు ఖర్చులు కూడా 60 నుంచి 70 శాతం తగ్గుతాయని, ఫలితంగా రైతుల నికర ఆదాయం పెరుగుతోందని ప్రాజెక్టు ప్రయోజనాలు రేవంత్ వివరించారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై రేవంత్‌తోపాటు గైడ్ టీచర్ సునీతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



మెదక్ అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం స్థానిక గుల్షన్ క్లబ్‌లో రెంజుకీ షోటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో బెల్టులు సాధించినట్లు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు.

గాగిల్లాపూర్‌లో కొండచిలువల భయం


గ్రామస్థుల చేతిలో హతమైన కొండ చిలువ

బెజ్జంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాగిల్లాపూర్‌లో వారం రోజుల నుంచి కొండ చిలువలు సంచరిస్తూ గ్రామస్థులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా ఆదివారం మరో కొండ చిలువ గ్రామంలోని నివాస సముదాయాల మధ్య సంచరిస్తూ ప్రజలకు కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మహిళల కేకలతో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు కొండ చిలువపై కర్రలతో దాడి చేసి హతమార్చారు. వరుసగా వారం రోజుల్లో నాలుగు కొండ చిలువలు గ్రామంలో సంచరించడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు గ్రామంలో పర్యటించి కొండ చిలువల ఆచూకీని తెలుసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట శివారులోని మిలాన్ గార్డెన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి(25-30 ఏళ్లు) గాయాలతో పడి ఉన్నాడు. గమనించిన పొన్నాల గ్రామానికి చెందిన సాయిచరణ్ 108కి సమాచారం ఇవ్వడంతో అతడిని సిద్దిపేట ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు వైద్య సిబ్బంది పోలీసులకు తెలిపారు. మృతుడి ఎడమ ఛాతిపైన అంజలి అని పచ్చబొట్టుతో పేరు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భార్యతో కోర్టులో విడాకులు మంజూరు కావడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పొడిశెట్టి సంజీవ్(35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 29న తన తల్లి పొడిశెట్టి ఎల్లవ్వను సిద్దిపేట రైతుబజార్ వద్ద దింపి మళ్లీ వస్తానని చెప్పి అప్పటి నుంచి కనిపించకుండాపోయాడు. దీంతో సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామ శివారులో ఒడిసెలకుంట వద్ద లభించిన మృతదేహం సంజీవ్‌దిగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. నెల రోజుల క్రితం భార్యతో కోర్టులో విడాకులు మంజూరుకావడంతో అప్పటినుంచి మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా, ఒకరికి తీవ్రగాయాలు


రోడ్డుపై ఎగిరిపడ్డ కారు ఇంజన్

కొండపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు బోల్తాపడిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దుబ్బాక మండలం కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన రవి కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. కొండపాక మండలం దుద్దెడ శివారులోని కలెక్టరేట్ సమీపంలో రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్ల మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టి, అవతలివైపు బోల్తాపడి రోడ్డు పక్కన ఉన్న చెట్లవైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రవి కాలు విరిగింది. కారు ఇంజన్ తుక్కుతుక్కయి ఎగిరి రోడ్డుపై పడింది. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

ఐఐటీ హైదరాబాద్‌లో హాఫ్ మారథాన్

- ప్రారంభించిన ఎస్పీ రూపేష్, మాలావత్ పూర్ణ
- పాల్గొన్న 1500 మంది ఔత్సాహికులు
- సందడిగా మారిన ఐఐటీహెచ్ ప్రాంగణం


ఐఐటీహెచ్ ప్రాంగణంలో హాఫ్ మారథాన్‌లో పరుగులు తీస్తున్న యువకులు


మెడల్స్ చూపుతున్న మారథాన్ విజేతలు

కంది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ఐఐటీహెచ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21కే, 10కే, 5కే ఫన్‌రన్‌ల పేరిట 21 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందాల్లో పాల్గొనడానికి 1,00 ఔత్సాహికులు ఆసక్తి కనబర్చారు. వీరంతా గత నెల రోజులుగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మారథాన్‌లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అయితే ఈ మారథాన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, యువకులు, వృద్ధులు, ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు వయస్సు సంబంధం లేకుండా రన్నింగ్, జాగింగ్‌లు చేశారు. ఇందులో ప్రత్యేక ఆకర్షణగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ మాలావత్ అందరితో కలిసి పరుగులు తీస్తూ సందడి చేశారు. దీంతో ఐఐటీహెచ్ ప్రాంగణమంతా సందడి నెలకొన్నది. ఐఐటీహెచ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి మెయిన్ గేటు వరకు రన్నర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకునేందుకు 10 మీటర్లకు ఒకరు చొప్పున ఐఐటీహెచ్ విద్యార్థులను వాలంటీర్లుగా నియమించారు. ప్రతీ సర్కిల్ వద్ద వాటర్ పాయింట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ఈ మారథాన్ 11 గంటలకు వరకూ కొనసాగింది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతిఒక్కరూ ఐఐటీహెచ్‌లోని నూతన భవన సముదాయాలను, అక్కడి ప్రకృతి పచ్చదనాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. 21కే, 10కే, 5కే రన్‌ల పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఐఐటీహెచ్ అధికారులు బహుమతులను అందజేశారు. మారథాన్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో చదువుతో పాటు శారీరక దృఢత్వం పెంపొందించుకునేందుకు ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తాయన్నారు. స్థితిస్థాపక సమాజ స్ఫూర్తిని నింపేందుకు ఈ ఈవెంట్ ఒక మైలురాయి అన్నారు. ఈ కార్యక్రమం ప్రజలందరితో సహకారం, స్నేహభావంతో పాటు జీవనశైలిని ప్రేరేపించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.

శారీరక శ్రమతోనే ఆరోగ్యం



ఉదయాన్నే లేవగానే ప్రతీరోజు క్రమం తప్పకుండా జాగింగ్ చేస్తాను. ఉదయం 5 గంటల నుంచే నా దినచర్య మొదలవుతుంది. ఈ రోజు ఐఐటీహెచ్ మారథాన్‌లో నేను కూడా భాగస్వామినయినందుకు ఆనందంగా ఉన్నది. ప్రతీ ఒక్కరు తమ దైనందిక జీవితంతో వ్యాయామాన్ని అలవాటు చేసుకుంటే ఎంతో చురుకుగా ఉంటారు. శారీరక శ్రమతోనే ఆరోగ్యం లభిస్తుంది.

- ఆనందరావు, నల్లగండ్ల, హైదరాబాద్

రన్నింగ్ చేస్తే ఒత్తిడి మాయం



ప్రతీరోజు రన్నింగ్ చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఒత్తిడి మాయం అవుతుంది. నేను ప్రతిరోజు గంటసేపు రన్నింగ్ చేస్తాను. అదేనున్న ఈ రోజు ఐఐటీహెచ్‌లో 21కే రన్‌లో పాల్గొనేందుకు తోడ్పడింది. ఎలాంటి అలుపు లేకుండా నేను గంటకుపైగా పరుగెత్తగలను. రన్నింగ్ చేయలేకపోయినా కనీసం వాకింగ్ అయినా చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచింది.

- సుగుణ, హైటెక్‌సిటీ, హైదరాబాద్

పరుగుతో ఆరోగ్యం మెరుగు పడుతుంది



రోజు 30 నిమిషాలు పరుగులు తీస్తే ఆరోగ్యం మెరగవుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెంచడానికి రన్నింగ్ దోహదపడుతుంది. ఐఐటీ హైదరాబాద్‌లో ఈ హాఫ్ మారథాన్ కాంపిటీషన్‌లో పాల్గొనడానికి నేను మా స్నేహితులతో కలిసి బెంగుళూరు నుంచి వచ్చాను. ఇక్కడ 21కే రన్నింగ్ చేయడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది. రోజు రన్నింగ్ చేయడం నా హబీగా మలుచుకున్నాను.

- గాయత్రి, బెంగుళూరు

ఒలింపిక్స్‌లో మెడల్ సాధిస్తా



ఐఐటీహెచ్ ఉన్న డీఏవీ స్కూల్‌లో నేను ఫోర్త్ క్లాస్ చదువుతున్నాను. మా పేరెంట్స్ ప్రోత్సాహంతో నేను ఈ మారథాన్ 5కే రన్‌లో పాల్గొన్నాను. ఈ పోటీ నాకు ఎంతగానో నచ్చింది. ఉదయాన్నే పెద్దవాళ్లతో కలిసి పరుగులు తీయడం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నేను పెద్దాయ్యాక మన ఒలింపిక్స్‌లో పాల్గొని మన దేశానికి మెడల్స్ తీసుకొస్తా.

- ప్రణీత్, డీఏవీ స్కూల్, ఐఐటీహెచ్



వంటల పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ తనూజ, ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ సరోజిని, కుకింగ్ కాంపిటీషన్‌లో పాల్గొన్న మహిళలు

మన వంటగది.. మన బాధ్యత

- సందడిగా సాగిన ఐవోసీఎల్ కుకింగ్ కాంపిటీషన్
- ఓవైపు అవగాహన కార్యక్రమాలు.. మరోవైపు వంటల ఘుమఘుమలు
- సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్‌లో మహిళలకు అవగాహన

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు వంటగదిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ వాడుతున్నప్పుడు పాటించాల్సిన సేఫ్టీ టిప్స్ పట్ల అవగాహన కల్పిస్తూనే.. మరోవైపు మహిళా వినియోగదారుల వంటల ఘుమఘుమలతో ఐవోసీఎల్ కుకింగ్ కాంపిటీషన్ సందడిగా సాగింది. సిద్దిపేట పట్టణంలోని కొండా భూదేవి ఫంక్షన్‌హాల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఆధ్వర్యంలో సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం మహిళలకు కుకింగ్ కాంపిటీషన్ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ తనూజ, సికింద్రాబాద్ ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ సరోజనితో కలిసి కాంపిటీషన్‌ను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి ఎంపికచేసిన 20 మంది మహిళలు వంటల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంపికచేసి బహుమతులను అందజేశారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సమావేశంలో గ్యాస్ వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ సరోజని మహిళలకు వివరించారు. ఐవోసీఎల్ డీలర్లు వామనరావు, పల్లకొండ వెంకటేశ్వర్లు, నీలం రవీందర్, సోమయ్య మాట్లాడుతూ వినియోగదారులు గ్యాస్ వాడుతున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే 1906 నెంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు.

గ్రామాల్లో అవగాహన కల్పించాలి



ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో విస్తృతంగా చేపట్టాలి. చాలామందికి గ్యాస్ వాడకం తెలియక ఇబ్బందులు పడుతుంటారు. చాలాఏళ్లుగా సురక్ష పైపులు మార్చకుండా అలాగే వంటలు చేస్తుంటారు. వాళ్లకు అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమం ద్వారా తెలియని విషయాలు తెలుసుకోవటంతో పాటుగా జాగ్రత్తలపై అవగాహన వచ్చింది.

- చిలుక స్వర్ణలత, గజ్వేల్, విన్నర్

సంగారెడ్డిలో హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో..


అవగాహన కల్పిస్తున్న హెచ్‌పీ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ శివకృష్ణ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని చక్ర వెంచర్‌లో హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో 'మన వంట గది-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ఫుడ్ కాంపిటీషన్ ఆదివారం నిర్వహించారు. హెచ్‌పీ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ శివకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలు వంట వండేటప్పుడు గ్యాస్ కంపెనీల ద్వారా సేఫ్టీపై అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ఫుడ్ కాంపిటీషన్ నిర్వహించగా 50 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ జిన్నా మురళీధర్‌రెడ్డి, బీపీసీ, ఐవోసీ డీలర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

- ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు
- మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం, పోలీసులు

హత్నూర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళను హత్యచేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు దుండగులు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నస్తీపూర్ గ్రామ శివారులో వెలుగుచూసింది. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లే రైతులు ఆదివారం ఉదయం మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిన్నారం సీఐ నయీమొద్దీన్, ఎస్ఐ సుభాష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు 25 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఉండగా, రెండు కాళ్లకు వెండి కడియాలు, చెవులకు మాటీలు, ఒంటిపై ఆకుపచ్చ చీర ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ ద్వారా వివరాలు సేకరించారు. మహిళను ఎక్కడో హత్య చేసి తీసుకొచ్చి ఇక్కడ తగులు పెట్టినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే సీఐ జిన్నారం 8712656730, హత్నూర ఎస్ఐ 8712656752 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కేతకీ ఆలయంలో భక్తుల సందడి

ఝరాసంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివరావడంతో ఆలయం సందడిగా మారింది. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేశారు. అదేవిధంగా మండల పరిధి మాచూనూర్ గ్రామ శివారులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేశారు. కాగా కేతకీ ఆలయంలో సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు కుటుంబసమేతంగా పూజలు చేశారు.

లలితా పరమేశ్వరి ఆలయంలో సహస్ర చండీహోమం


తూప్రాన్ లలితాపరమేశ్వరీ ఆలయంలో లక్ష దీపోత్సవం

తూప్రాన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) శివారులోని లలితాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం 1,089వ చండీహోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, దేవీ ఉపాసకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, లక్ష దీపోత్సవం, 1,089వ చండీయాగం నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో జన్మించిన చిన్నారులకు తులాభారం, 2025 క్యాలెండర్ ఆవిష్కరణ చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో ఘనంగా క్యారెల్స్ సండే


క్యారెల్స్ కార్యక్రమానికి హాజరైన భక్తులు

మెదక్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐలో ఘనంగా క్యారెల్స్ సండే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ప్రెసిబెటర్ అలెగ్జాండర్ జాన్ భక్తులకు దైవ ప్రవచనాలు వినిపిస్తూ పవిత్రమైన మనసుతో దేవుడిని ఆరాధిస్తే దేవుడు తప్పకుండా మనల్ని ఆదరిస్తాడన్నారు. దైవదూతల కాలం నుంచి క్యారెల్స్ పాడడం ఆచరణలో ఉందన్నారు. అనంతరం భక్తులు ఆలపించిన గీతాలు, చిన్నారుల ఆటలు అందరినీ అలరించాయి.

లాజిస్టిక్ హబ్‌గా మనోహరాబాద్

- పర్కిబండలో 315 ఎకరాల్లో లాజిస్టిక్ పరిశ్రమ
- ఇప్పటికే 200లకు పైగా పరిశ్రమలు
- భవిష్యత్‌లో జాతీయస్థాయికి..


కొండాపూర్‌లో టీజీఐఐసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు


పర్కిబండ శివారులో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్కు కోసం టీజీఐఐసీకి అప్పగించిన స్థలం

మనోహరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం ఇక లాజిస్టిక్ హబ్‌గా మారబోతోంది. ఇప్పటికే మండల కేంద్రంలో 200లకు పైగా చిన్న, భారీ మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. కొత్తగా మండల పరిధిలోని పర్కిబండ శివారులో సుమారు 315 ఎకరాలకు పైగా భూ సేకరణ చేసి అక్కడ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కును కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్మించనున్నది. ఇది అందుబాటులోకి వస్తే మెదక్ జిల్లాలో మనోహరాబాద్ మండలం పరిశ్రమలకు అడ్డాగా మారుతుంది. లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు పర్కిబండ శివారు ప్రాంతం అనువుగా ఉన్నదని గుర్తించి రాష్ట్రమంత్రి మండలి తాజాగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది 72 ఎకరాల భూమిని గుర్తించారు. దీని దస్త్రాలు సిద్ధం చేసి టీజీఐఐసీ(తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) అధికారులకు అప్పగించి కసరత్తు మొదలుపెట్టారు. ఇక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే సుమారు 3 వేలకుపైగా మందికి ఉపాధి లభిస్తుంది. మెదక్ జిల్లాలో రీజినల్ రింగ్‌రోడ్డు, రైల్వే లైన్, మనోహరాబాద్ మండలం మీదుగా 44వ జాతీయ రహదారి, అటు నర్సాపూర్ నియోజకవర్గం మీదుగా 765-డి జాతీయ రహదారి ఉండడంతో లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలమైనదిగా గుర్తించారు.

రాజ్యసభలో ఆమోదం

నాలుగురోజుల క్రితం మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పర్కిబండలో 315 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కూమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. సాధ్యాసాధ్యాల అధ్యయనంలో నివేదికను రూపొందిస్తున్నట్లు చెప్పారు.

డ్రై పోర్టు

లాజిస్టిక్ పార్కులో డ్రై పోర్టు నిర్మించడంతో ఇక్కడి నుంచి నేరుగా జాతీయస్థాయి, రైలు, విమాన, సముద్రమార్గాల ద్వారా వస్తువులు ఎగుమతి చేసుకోవడం జరుగుతుంది. డ్రైపోర్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అలాగే లాజిస్టిక్ పార్కు కోసం మనోహరాబాద్ 44 జాతీయ రహదారి, లేదా తూప్రాన్ నుంచి నర్సాపూర్ వెళ్లే దారిగుండా తక్కువ దూరం వచ్చేటట్టు 150 మీటర్ల వెడల్పులతో రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులు పరిశీలిస్తున్నారు.

పరిహారం అందజేత

పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో సుమారు 72 ఎకరాల గ్యాప్‌లైన్ భూమిని, 6.5 ఎకరాల పట్టా భూమిని, 234 ఎకరాల ప్రభుత్వ, ఎఫ్‌టీఎల్ భూములు సుమారు 315 ఎకరాలు సేకరించారు. రైతులకు ఎకరాకు రూ.19 లక్షలు, ఇతర పంటల దిగుబడిని బట్టి రూ.9.5 లక్షల నుంచి రూ.14 లక్షల చొప్పున మొత్తం రూ.42 కోట్ల వరకు పరిహారం అందజేశారు. తాజాగా కేంద్రం ఆమోదం తెలపడంతో పర్కిబండ శివారులోని 611, 209 సర్వే నెంబరు మధ్యలో 72 ఎకరాల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

జాతీయస్థాయిలో ఎగుమతులు



మా గ్రామంలో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. పరిశ్రమల్లో మండలంలోని ఆయా గ్రామాల నిరుద్యోగులు, పర్కిబండలో భూములు కోల్పోయిన వారికి అవకాశం కల్పించాలి. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలను ఆదుకోవాలి.

- శ్రీలతాఆనంద్, మాజీ ఎంపీటీసీ

భూసేకరణ పూర్తిచేశాం



మనోహరాబాద్ మండలం పర్కిబండ శివారులో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేశాం. మెదక్ జిల్లాలో రీజినల్ రింగురోడ్డు, రైల్వే లైన్లు, మనోహరాబాద్‌లో 44వ జాతీయ రహదారి, కాశ్మీర్ టు కన్యాకుమారి వరకు కలదు. అటు నర్సాపూర్‌లో 765-డీ జాతీయ రోడ్డు ఉండటంతో రానున్నకాలంలో ఎక్కువ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతుంది.

- చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, మనోహరాబాద్

రాజస్థాన్ నుంచి జిల్లాకు

- ఇనుప పనిముట్ల తయారీతో ఉపాధి
- చెమటోడ్చుతున్న మహిళలు, పిల్లలు
- గ్రామాల్లోని బస్టాండ్లే ఆవాసాలు


ఇనుప పనిముట్ల తయారీలో భాగంగా సమ్మెట కొడుతున్న మహిళలు

రాయపోల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల క్రితం వరకు కొలిమి లేని గ్రామాలు ఉండేవి కావు, అలాంటిది ఇప్పుడు ఎక్కడో ఒక చోట తప్ప అవి కనిపించడం లేదు. కమ్మరి పనివారు వ్యవసాయ పనులకు అవసరమైన ఇనుప పనిముట్లు తయారు చేసేవారు. పల్లెల్లోని అన్ని చేతివృత్తుల వారి మాదిరిగానే కమ్మరి పనివాళ్లకు కూడా ఉపాధి కరువవడంతో వృత్తి పనులు చేయడం తగ్గించారు. దీంతో రాజస్థానీలు ఇక్కడి వారి పనిముట్ల లోటును తీరుస్తున్నారు.

కడుపు నింపుకోవడానికి..

కుటుంబ పోషణ కోసం సుదూర ప్రాంతాన్ని కూడా లెక్కచేయకుండా రాజస్థాన్ నుంచి పలు కుటుంబాలు ఇనుప పనిముట్ల తయారీ నిమిత్తం సిద్దిపేట జిల్లాకు వస్తున్నాయి. ఒక్కో గ్రామంలో గిరాకీని బట్టి నాలుగైదు రోజులు ఉంటూ ఇనుప పనిముట్లు తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. పొట్టకూటి కోసం ఎంతో కష్టపడి పనిముట్లు తయారుచేసి విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కొడవళ్లు, కత్తులు, గొడ్డళ్లు, చాకులు, కూరగాయలు కోసే కత్తిపీటలు తదితర వస్తువులను తయారు చేస్తున్నారు. ఈ పనిముట్లు తయారు చేసేందుకు పెద్ద వాహనాలకు వినియోగించిన ఇనుప కమాన్ పట్టీలను అవసరమైన ఆకారంలో మలిచేందుకు మహిళలు, పిల్లలు పెద్ద సమ్మెటను కొడుతూ చెమటోడుస్తున్నారు.

బస్టాండ్లు, ఇళ్ల మడిగెల్లో బస

తరచూ గ్రామాలు మారుతుండడంతో ఏ కాలమైనా బస్టాండ్లోనే రాజస్థానీలు బస చేయక తప్పడం లేదు. మరికొందరు ఇళ్ల మడిగెల్లో ఉంటూ పనిముట్లు తయారు చేస్తున్నారు. చలివేసినా, వర్షం కురిసినా తట్టుకుని ఉండాల్సిందే. ఆరు బయటనే రాళ్లతో పొయ్యిలు వేసుకొని వంటలు చేసుకుంటూ జీవిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గజ్వేల్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పనిపై వెళ్లిన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన పుడూరు అశోక్‌చారి(42) గ్లాస్ ఫిట్టింగ్ పనిచేస్తాడు. పనిలో భాగంగా సెప్టెంబరు 9న ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు వెళ్లాడు. అక్టోబరు 9 వరకు కుటుంబసభ్యులకు ఫోన్‌లో అందుబాటులో ఉన్నాడు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబసభ్యులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.28,700 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు.

ప్రజాపాలన కాదు.. పాపిష్టి పాలన

- బీఆర్ఎస్ సిద్దిపేట నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు ప్రజాపాలన అని చెప్పి పాపిష్టి పాలన చేస్తున్నారని, వారు చేసేది విజయోత్సవాలు కాదు వంచన ఉత్సవాలని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండు భూపేష్ మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి, వాటిని నెరవేర్చకపోగా విజయోత్సవాల పేరిట ప్రజాధనం వృథా చేయడం సరికాదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు సాయన్నగారి సుందర్, సాయి ఈశ్వర్‌గౌడ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, బీఆర్ఎస్ నాయకులు మోహిజ్, నాగరాజు, రమేష్, గుజ్జ రాజు, హైమద్, బండి శ్రీకాంత్, రాజశేఖర్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

చిన్నకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆరోపించారు. చిన్నకోడూరులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ ప్రజా ప్రతినిధులు పాపయ్య, ఉమేష్ చంద్ర, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పోచయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అధ్వానంగా గురుకులాలు

- బీఆర్ఎస్వీ నాయకులు


సిద్దిపేట రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అధ్వానంగా తయారయ్యాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు ఆరోపించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాలను వారు సందర్శించారు. ఈ మేరకు గురుకుల పాఠశాలలోని వంటగది, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, సాంఘిక సంక్షేమ గురుకులాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

- సిద్దిపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకునుడే తప్పా గురుకుల విద్యార్థులకు చేసిందేమిలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి శివారులోని ఎల్లంకి భవనంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల, మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం

- ఐఎంఏ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు నాగమునెయ్య



గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

గజ్వేల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గజ్వేల్ శాఖ అధ్యక్షుడు నాగమునెయ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఐఎంఏ, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహా ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ సోకిన వ్యక్తిలో రోగ నిరోధక శక్తి తగ్గి అనేక రోగాలు వస్తాయని, దీన్నే ఎయిడ్స్ అంటారాన్నారు. హెచ్ఐవీకి నివారణే శరణ్యమన్నారు. ఆయనవెంట ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ సభ్యులు పెంటాచారి, డాక్టర్ నరేశ్‌బాబు, మంద సాయినాథ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రగతి విప్లవం

- చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి

చేర్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే మారుమూల పల్లెలు, గ్రామాలు అభివృద్ధి, ప్రగతికి నోచుకున్నాయని, కాంగ్రెస్ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి విమర్శించారు. చేర్యాల పట్టణంలోని 12వ వార్డులో రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆదివారం ఆమె వార్డు కౌన్సిలర్ సతీశ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, మంగోలు చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ శవరాజకీయాలు మానుకోవాలి

- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శవరాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గురుకులాలపై బీఆర్ఎస్ దృతరాష్ట్ర ప్రేమ చూపిస్తున్నదని, కేసీఆర్ హయాంలో గురుకులాల రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరి రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, కలీముద్దీన్, వహీద్‌ఖాన్, దాస అంజన్న, బుచ్చిరెడ్డి, గోపికృష్ణ, ముద్దం లక్ష్మి, షాబుద్దీన్, మున్నా, మంద పాండు, వెంకట్‌రెడ్డి, గయసుద్దీన్, కొంగ సాంబమూర్తి, కొత్త మహిపాల్‌రెడ్డి, వాహబ్, ఎర్ర మహేందర్, అర్షద్, బాబు, ఏరాబోలు రాజిరెడ్డి, వనజ, జనార్ధన్‌రెడ్డి, అజ్మత్, చోట అజ్మత్, రాజు, కవిత పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగం మరువలేనిది

- వర్ధంతిలో నాయకులు


గజ్వేల్ పట్టణంలో కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గజ్వేల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగం మరువలేనిదని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి, నాయకులు అన్నారు. తెలంగాణ ఉద్యమ పోలీసు అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ ఏర్పాటుకు గజ్వేల్ పట్టణంలో ఆదివారం శంకుస్థాపన చేశారు.

- సిద్దిపేట రూరల్: కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- కోహెడ: స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం నాయకులు, బీసీ నాయకులు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు.
- మద్దూరు: మండల కేంద్రంతో పాటు గాగిళ్లాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు.
- చిన్నకోడూరులో కానిస్టేబుల్ కిష్టయ్య ఫ్లెక్సీకి ముదిరాజ్ సంఘం సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.
- నంగునూరు: మండలంలోని పాలమాకులలో మత్స్యకారుల ఆధ్వర్యంలో కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు.
- సిద్దిపేట అర్బన్: సిద్దిపేటలో ముదిరాజ్ సంఘం నాయకులు కానిస్టేబుల్ క్రిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కానిస్టేబుల్ క్రిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.
- బెజ్జంకిలో కానిస్టేబుల్ క్రిష్టయ్య చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు గడువు పెంపు

రాయపోల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు గడువు పెంచినట్లు రాయపోల్ తహసీల్దార్ దివ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 9వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదుకు ఒకటి నవంబరు 2021 నాటికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ, డిగ్రీ మెమో లేదా ప్రొవిజినల్ జిరాక్స్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి రాయపోల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్ణీత గడువులోగా అందజేయాలని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


అవార్డు అందుకుంటున్న మహేందర్

హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొత్తపల్లి మహేందర్ ఆదివారం హైదరాబాద్‌లో ఆదర్శ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గౌతమ బుద్ధ ప్రపంచ శాంతి అవార్డ్ పురస్కార ప్రదానోత్సవంలో మహేందర్‌కు జ్ఞాననంది ఆదర్శ ఉపాధ్యాయ అవార్డును ఘంటసాల ఇంటర్నేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు అందజేశారు. మహేందర్‌కు అవార్డు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాపాలన విజయోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


దూళిమిట్ట: వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

దూళిమిట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రథమస్థానం ఇ.మనస్వి, ద్వితీయస్థానం సాగర్, తృతీయస్థానం జి.లాస్య సాధించినట్లు మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీనాంజనేయులు తెలిపారు.

- మర్కుక్: ప్రజాపాల, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, సుభాష్‌చందర్ పాల్గొన్నారు. గెలుపొందిన వారిని ఎంఈవో వెంకట్‌రాములు అభినందించారు.
- గజ్వేల్ రూరల్: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవం పేరుతో కళాకారులు ఊరూరా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆదివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు.

గజ్వేల్ ఆర్‌అండ్ఆర్ కాలనీలో వైద్యశిబిరం

గజ్వేల్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవ ఆత్మ సంతృప్తినిస్తుందని ఎస్బీఐ జనరల్ మేనేజర్ ప్రకాష్‌చంద్ర బరోర్ పేర్కొన్నారు. గజ్వేల్ ఆర్‌అండ్ఆర్ కాలనీలో ఎస్బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి ఈడీగా రామాచారి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారికి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఇన్‌చార్జి బాధ్యతలను ఎస్సీ కార్పొరేషన్ ఎండీ క్షితిజ అప్పగించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో స్వీకరించనున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీరామ్‌రెడ్డిపై ఆరోపణ రావడంతో ఆయనను తన మాతృశాఖకు రిపోర్టు చేయాలని ఆమె ఆదేశించారు.

కోహెడ పద్మశాలి సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

కోహెడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోహెడ గ్రామ పద్మశాలి సేవా సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోవిందు సురేష్, గౌరవ అధ్యక్షులుగా గోవిందు మనేశం, ఉపాధ్యక్షుడిగా కొండబత్తిని రాజలింగం, ప్రధాన కార్యదర్శిగా ఆకుబత్తిని శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా నరాల అశోక్, కోశాధికారిగా గాదాసు శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా కొండ ప్రశాంత్, కార్యవర్గసభ్యులుగా వడ్డేపల్లి రామకృష్ణ, గొరిట్యాల వెంకటరాములు, నరాల శ్రీకాంత్, గాజుల శంకర్, సతీష్, వడ్డేపల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు.

మిట్టపల్లి రెడ్డి సంక్షేమ సంఘం..

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా బాల్‌రెడ్డిని ఎన్నుకోవడంతో పాటు డైరెక్టర్లుగా తిరుపతిరెడ్డి, కనుకరెడ్డి, రాజిరెడ్డి, సంతోష్, దేశమంతరెడ్డి, నర్సింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా సంజీవరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంరెడ్డి ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్


పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న కేడం లింగమూర్తి

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో సమాజాన్ని చైతన్యపరచొచ్చని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. కవి, రచయిత ఉండ్రాళ్ల రాజేశం రాసిన బాలలారా శతకం పుస్తక పరిచయ కార్యక్రమం సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. చందోబద్ధమైన పద్యసాహిత్యం ద్వారా రాజేశం అందించిన పుస్తకంలో చిన్ననాటి ముచ్చట్ల యాదితో ప్రతి ఒక్కరికి బాల్యంలోని సంఘటనలు మదిలో మెదులుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే సెమినార్‌లో ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న పాషా

చేర్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేరళలోని త్రిసూర్ స్పోర్ట్స్ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ కరాటే సెమినార్‌లో చేర్యాల పట్టణానికి చెందిన కరాటే చీఫ్ సెన్సాయ్ ఎం.ఎస్. పాషా ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 12 దేశాల నుంచి 1000మంది క్రీడాకారులు పాల్గొనగా, రాష్ట్రం నుంచి పాషా, మరో అయిదుగురు పాల్గొన్నారు. ఈమేరకు వరల్డ్ గ్రాండ్ మాస్టర్ సుసుకి షిహాన్ మాసావో కగావా చేతులమీదుగా ప్రశంసాపత్రం అందించారు.



వృథాగా పోతున్న నీరు

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ఓ వార్డులో ఇంటి యాజమానులు స్థానికంగా లేకపోవడంతో మిషన్ భగీరథ నీరు రోడ్డుపై వృథాగా పోతున్నది. ఒకే చోట రెండు నల్లాల నుంచి నీరు పోతుండటంతో రహదారి బురదమయంగా మారుతున్నది.

- దుబ్బాక

సినీనటుడు గుండు రవితేజకు ఫైమా నేషనల్ అచీవర్స్ అవార్డు

- హైదరాబాద్‌లో అందజేత

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన సినీనటుడు గుండు రవితేజ ఫైమా నేషనల్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఓ హోటల్ ఫెడరేషన్ ఆఫ్ ఆన్ ఇంక్రెడిబుల్ టీవీ అండ్ మూవీ ఆర్టిస్ట్ (ఫైమా) ఆధ్వర్యంలో ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్, టీటీడీ రిటైర్డ్ జేఈవో బి. లక్ష్మీకాంతం చేతులమీదుగా గుండు రవితేజ అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫైమా ఫౌండర్, చైర్మన్ నరోత్తంకుమార్, పలువురు సినీనటులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- ఆదివారం కావడంతో పెరిగిన రద్దీ


చేర్యాల: ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తుల కోలాహలం

చేర్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించారు. అభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బెల్లం పాయసం వండి బోనం నివేదించారు. చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, బండారి సమర్పించారు. తమ కోరికలు తీర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. మల్లన్న సహోదరి ఎల్లమ్మ తల్లికి బోనం నివేదించి కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యం సమర్పించారు.

మల్లన్న ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవంలో భాగంగా ముఖమండపంలో శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

- సిద్దిపేట రూరల్: నారాయణరావుపేట మండల కేంద్రం శివారులోని స్వయంభు శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామికి కార్తీక అమావాస్య సందర్భంగా ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు భువనేశ్వరి, శాస్త్రీయ జ్యోతిష్య పీఠం వ్యవస్థాపకుడు డా.రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి అష్టోత్తర శతఘట (108) క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ పూజారి సీతారామశర్మ, రాజు, శ్రీనివాస్, సతీష్, కృష్ణ పాల్గొన్నారు.

ములుగులో అయ్యప్ప పడిపూజ

ములుగు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దయవల్ల ప్రజలు బాగుండాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. మండల కేంద్రమైన ములుగులో దాస చంద్రశేఖర్ 18వ పడిపూజ ఆదివారం శివాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ హాజరైయ్యారు.


అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ఆరుబయటే భోజనం

ఐదో పేజీ తరువాయి

మండలంలో రామవరం, అక్కన్నపేట, మల్లంపల్లి, అంతకపేట పూర్తయినప్పటికీ ఇందులో కొన్నింటికి రంగులు వేయలేదు. కేశవాపూర్ ఇంకా పనులు మొదలు పెట్టలేదు. గౌరవెల్లి, జనగామలో అసంపూర్తిగా మిగిలిపోయాయి. కోహెడ మండలంలో తంగళ్లపల్లి, సముద్రాలలో పూర్తి కాలేదు. మద్దూరు మండలంలో మద్దూర్, సలాఖ్‌పూర్‌లో పూర్తి కాగా కలర్లు వేయలేదు. బెజ్జంకి మండలంలో బెజ్జంకి బాలికల పాఠశాల, కల్లెపల్లి, గుండారం, రేగులపల్లి, బేగంపేట, గుగ్గిళ్ల ఉన్నత పాఠశాలలకు డైనింగ్‌హాళ్లు మంజూరు కాగా మొత్తం పూర్తయ్యాయి. పలుచోట్ల డైనింగ్‌హాళ్లను కాంట్రాక్టర్లు హ్యాండోవర్ చేయనప్పటికీ విద్యార్థులకు అందులో భోజనం పెడుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని, వాటిని వినియోగించవద్దని కాంట్రాక్టర్లు కోరుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కాగా ఇవి నిరూపయోగంగా ఉండటంతో విద్యార్థులు చెట్ల కింద మట్టిలో భోజనాలు చేస్తున్నారు. వీటిని నిర్మించినా ప్రయోజనం లేకుండాపోతుందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కిచెన్‌షెడ్లు, అదనపు తరగతి గదులు పూర్తయినా..

హుస్నాబాద్ డివిజన్‌లో పలు పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు పూర్తయినప్పటికీ అవి నిరూపయోగంగా ఉంటున్నాయి. హుస్నాబాద్, అక్కన్నపేట ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు పూర్తి కాగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని హ్యాండోవర్ చేయలేదు. దీంతో వాటికి తాళాలు వేసి ఉంచుతుండటంతో బయట మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారు. అలాగే శనిగరం, చౌటపల్లి పాఠశాలల్లో అదనపు తరగతి గదులు పూర్తయినా అప్పగించలేదు. ఇప్పటికైనా పూర్తయినా వాటిని వినియోగంలోకి తేవాలని, అసంపూర్తిగా ఉన్న డైనింగ్‌హాళ్లు, కిచెన్‌షెడ్లు, అదనపు తరగతి గదులను పూర్తి చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.